రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (శుక్రవారం సాయంత్రం)
సహర్ 4:54 (శనివారం ఉదయం)

లక్ష్యం నెరవేరేనా..?



- జిల్లాలో 13 మార్కెట్ యార్డులకు టార్గెట్లు
- వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.18.65 కోట్ల ఆదాయం లక్ష్యం
- లక్ష్యసాధనకు అధికారుల ప్రణాళిక



జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.18.65 కోట్ల ఆదాయం రావాలని లక్ష్యం ఖరారు చేశారు. మార్కెట్ యార్డుల వారీగా టార్గెట్లను నిర్దేశించారు. ప్రస్తుత యేడాది మార్కెట్ యార్డులకు పంట ఉత్పత్తులు పెద్దఎత్తున వస్తాయన్న అంచనాతో లక్ష్యం మేర ఆదాయం సమకూరుతుందని సంబంధిత అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. జగిత్యాల, కోరుట్లలో మామిడి, మెట్‌పల్లి మార్కెట్ యార్డు పసుపుకు పేరెన్నిక కలిగింది. వెల్గటూరులో పత్తి, ఇబ్రహీంపట్నంలో కందులు, వివిధ మార్కెట్ యార్డులలో వరి ధాన్యం, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులు విక్రయానికి వస్తుంటాయి. వీటి క్రయ విక్రయాల ద్వారా మార్కెట్ కమిటీలు ఆదాయాన్ని సాధిస్తుంటాయి. మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొని వచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేసి లావాదేవీల ఆధారంగా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు చెల్లింపు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. దీంతో పాటు పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే రైస్‌మిల్లులు, ఆయిల్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, ఇతర ఏజెన్సీలు సైతం సెస్ చెల్లించాల్సి ఉంటుంది. పంట ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు చెక్ పోస్టుల వద్ద సంబంధిత యార్డులకు సెస్ చెల్లించాలి. ప్రభుత్వం తరఫున ఎఫ్‌సీఐ, సీసీఐ, ఐకేపీ, సింగిల్ విండోలు, మార్క్‌ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థలు యార్డులలో పంట ఉత్పత్తులకు మద్దతుధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తుంటాయి. సంబంధిత సంస్థలు సైతం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరుపుతున్న పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలపై ఫీజును వసూలు చేస్తూ ఆదాయం సమకూర్చుకుంటాయి.

● నాలుగేళ్లలో మార్కెట్ ఆదాయం ఇలా...

జిల్లాలోని 13 వ్యవసాయ మార్కెట్ యార్డులలో గత మూడేళ్లలో లక్ష్యం మేరకు ఆదాయాన్ని సాధించారు. 2020-21 సంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కలిపి రూ.27.22 కోట్ల మార్కెట్ ఫీజునువసూలు చేశారు. అదేవిధంగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని వ్యవసాయ మార్కెట్‌కమిటీలలో కలిపి రూ.15.74కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా వందశాతం ఫీజును వసూలు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు లక్ష్యం రూ. 21.52 కోట్లు కాగా రూ. 26.22 కోట్లు వసూలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 25.94 కోట్లు ఆదాయం సాధించడం లక్ష్యం కాగా

● జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో 13వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఒకటి ఉపమార్కెట్ కమిటీలున్నాయి. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, వెల్గటూరు, రాయికల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీలు పనిచేస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలో వెల్గటూరు మండలం చెప్యాల్‌లో ఉప మార్కెట్ కమిటీ పనిచేస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ లందు రైతులకు, వర్తకులకు కావాల్సిన సౌకర్యములు కల్పించి సేవలు అందిస్తున్నందుకు గానూ ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులపై ఒక శాతం మార్కెట్ ఫీజును కొనుగోలు దారుల నుంచి వసూలు చేస్తున్నారు. జిల్లా లోని వ్యవసాయ మార్కెట్ యార్డులలో 29,550 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 23 గోదాములు ఏర్పాటు చేశారు. నాబార్డు కింద జగిత్యాల జిల్లాకు జిల్లా లోని పలు ప్రాంతాల్లో 52,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 14 అదునాత గోదాములు నిర్మించి రైతులకు సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, గొల్లపల్లి మార్కెట్ యార్డులలో జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్) విధానాన్ని అమలు చేస్తున్నారు.

నాటక రంగ దినోత్సవం

కొడిమ్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కడమేడ కళా సాహితి, శ్రీ తారకరామ కళా నిలయం సభ్యులు ప్రపంచ నాటక రంగ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నాటక రంగ పితామహులు కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఇటీవల మృతి చెందిన రంగస్థల నటుడు సందిరెడ్డి రాజిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. సీనియర్ కళాకారుడు నిజాం రాజన్నను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కడమేడ సాహితి, కళానిలయం సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కథలాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని సిరికొండలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంకు కథలాపూర్, భూషణరావుపేట, తక్కళ్ళపల్లి, ఊట్‌పల్లి గ్రామాల నుంచి వచ్చిన రోగులను రేకుర్తి కంటి వైద్యుడు ప్రభాకర్ పరీక్షలు నిర్వహించారు. 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. బస్సులో రేకుర్తి ఆసుపత్రికి వెంటనే తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పిడుగు సంజీవ్‌రెడ్డి, కార్య దర్శి ఎల్లాల ప్రతాప్ రెడ్డి, కోశాధికారి గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో ఆస్పత్రి పాలైన బాల్య మిత్రుడు జగిత్యాల పట్టణానికి చెందిన అబ్దుల్ రజాక్ అనే యువకుడికి అతడి మిత్రులు రూ.66 వేల ఆర్థిక సహాయం అందించారు. పట్టణంలోని శారద విద్యానిలయం పాఠశాలలో 1992-93 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు పలువురు మిత్రులు కలిసి సహాయాన్ని గురువారం అందించారు.

మత్స్య కార్మికులు బీమా తీసుకోవాలి

-జిల్లా సహకార సంఘం అధికారి మనోజ్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం అధికారి మనోజ్‌కుమార్

మెట్‌పల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క మత్స్య కార్మికుడు బీమా సౌకర్యం పొందాలని జిల్లా సహకార సంఘం అధికారి మనోజ్ కుమార్ అన్నారు. 70 సంవత్సరాల్లోపువారు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మెట్‌పల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలు సకాలంలో వచ్చే విధంగా ప్రభుత్వానికి విన్నవిస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, ఫీల్డ్ అధికారి అశోక్, మెట్‌పల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పర్రె శంకర్, కుడుముల సాయన్న, మగ్గిడి సురేష్, ఆర్మూర్ రంజిత్, పరిమి నర్సయ్య, పారిపెల్లి రమేష్, మాన్కాల పోచయ్య, మాన్కాల చిన్నయ్య, ఆర్మూర్ రాజేష్, ఆర్మూర్ నరేందర్, తోపారపు నాగయ్య, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం అందించాలి



కలెక్టరేట్ ఏవో హకీంకు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘం నేతలు

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం పరిపాలన అధికారి ఎండీ హకీంకు బీసీ సంక్షేమం సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పరిపాలన అధికారి హకీంను కలిసి సమస్యను విన్నవించారు. ఇటీవల జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన అకాల వర్షం కురవడం వల్ల రైతులు భారీగా పంట నష్టపోయారన్నారు. వరి, మొక్కజొన్న, మామిడి, నువ్వు, దోస తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నాయకులు రాంచందర్, గంగారం, వంశీ, రవి, హృషికేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలోనే ఫ్రెండ్లీ పోలీసింగ్'

జగిత్యాల క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే ఫ్రైండ్లీ పోలీసింగ్ విధానం అమలైందని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌లు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి బీఆర్ఎస్ నాయకులను పోలీసులు భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లపై అక్రమ కేసులను ఎత్తివేసి సరైన న్యాయపాలన అందించాలని కోరుతూ ఎస్పీ అశోక్‌కుమార్‌ను గురువారం మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వసంత, మాజీ ఎమ్మెల్యే రవి శంకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలీస్ అధికారులు చట్టానికి, రాజ్యాంగానికి లోబడి పనిచేయాలే తప్ప పార్టీకి లోబడి పనిచేస్తే తగిన మూల్యం తప్పదన్నారు. బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంమోహన్‌రావు, సాగర్ రావు, షైపాల్ రెడ్డి, మధు సూదన్, శ్రీనివాస్, ఆనంద రావు, గంగాధర్, తిరుపతి రెడ్డి, ప్రవీణ్, రాజన్న, కరుణాకర్, అజహర్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

'ఈజీఎస్ పనుల్లో నిబంధనలు పాటించాలి'

మల్లాపూర్, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు నిబంధనల ప్రకారం చేయాలని ఎంపీడీవో శశికుమార్ సూచించారు. గురువారం బుధవారం మండలంలోని ఓబులాపూర్ తండా శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కూలీలు పనులు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తమ వెంటా ఎప్పుడు మంచినీరు ఉంచుకోవాలన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఉపాధి పనులలో పాల్గొన్న కూలీలకు రోజు రూ.300లను చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించి, పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నీకల్ అసిస్టెంట్ సరిత, సిబ్బంది, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి

7

● బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

-మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వినతి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి సమస్యను విన్నవించారు. నియోజకవర్గంలో 6 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు పండించారని, కొనుగోలు కేంద్రాలు లేక పోవడం వల్ల పంట ఉత్పత్తులను విక్రయించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పరచి మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం



వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కోరుట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ పరిధిలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్‌లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అసుపత్రి సూపరింటెండెంట్ సునిత సిబ్బందితో సమావేశం ఏర్పాట చేసి ఆరోగ్య కారక్రమాల అమలు, సిబ్బంది నియామకం, నిధుల వినియోగం గూర్చి చర్చించారు. కేంద్రంలో జాతీయ స్థాయిలో అమలు అవులవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు క్షేతస్థాయిలో ఎలా నడుస్తున్నాయని పరిశీలన జరిపారు. ఏరియా అసుపత్రి ద్వార లబ్దిపోందిన వివిధ వ్యక్తులను కలిసి ఆరోగ్య సేవల గురించి వారితో మాట్లాడి తెలుసుకున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు, ల్యాబ్ సేవలు, గర్భిణీలకు ప్రసవానంతరం తల్లులకు అందించే వైద్య సేవలు, పిల్లల వ్యాధి నిరోదక టీకాలు నిర్వహణ రికార్డులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. ప్యూబార్టి సమయంలో వచ్చే మార్పులు వారికి ఇచ్చే కౌన్సెలింగ్ చేయడం, అసంక్రమిక వ్యాదులకు, సంక్రమిక వ్యాదులకు అందించే సేవలను వివరాలను పరిశీలించారు. మందుల నిలువలు, నిదుల వినోయగం గురించి క్షుణంగా సమీక్షించారు. ఆసుపత్రిలోని ఐసీటీసీ, టీబీ కేంద్రాలను తనిఖీని నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను తెలుసుకొని వారికి అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. క్షయ పోషణ యోజన క్రింద వారందరికి డబ్బులు అదుతున్నాయా లేదా అన్న విషయంపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ లక్ష్మి, ఈఎన్‌టీ వైద్యుడు రమేష్, జాతీయ ఆరోగ్యమిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి తులసి రవీంధర్, హెచ్‌ఈ తరాల శంకర్, సూపర్‌వైజర్లు మురళిధర్, సీనియర్ ఫార్మసిస్ట్ ఉదయ్ ప్రసాద్‌లతో పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి

-అసెంబ్లీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల/మల్లాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరణ చేసి రైతులకు అధికారం కల్పించాలని శాసనసభ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని గత ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసిందన్నారు. కేసీఆర్ 2014-15లో ఫ్యాక్టరీపై ఒక సహకారం సంఘం ఏర్పాటు చేసి రైతులకే అధికారం కల్పించాలని ఆలోచన చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2024లో ఫ్యాక్టరీ వద్ద రైతులతో మీటింగ్ ఏర్పాటు చేసి కమిటీ వేసి పునర్ధరణ పనులు ఆరు నెలలో చేపడుతామన్నారన్నారు. ఫ్యాక్టరీ కోసం దివంగత ఎమ్మెల్యే కొమిరెడ్డిరాములు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావులు రైతుల పక్షాన నిలబడి నిరాహార దీక్షలు చేశారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఏర్పాటు చేసిన కమిటీలో ఎమ్మెల్యేగా నన్ను చేర్చలేదని, కనీసం ఫ్యాక్టరీ కోసం పోరాడిన మాజీ ఎమ్మెల్యేలను చేర్చలేదన్నారు. షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు పరిశ్రమల శాఖ మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ధాన్యం కొనుగోలు విషయంలో కొనుగోలు కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాసంగిలో జిల్లాలో 118417 హెక్టార్ల వరి సాగు చేశారన్నారు. దీనికి గాను623849 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వరి ధరలను గ్రేడ్ ఏ 2320, కామన్ ధరలు 2300, సన్నరకం బోనస్ 5 వందలు, ఈ సీజన్‌కు గాను ఐకెపి 133, పిఏసిఎస్ 273, మెప్మా 1, మొత్తం 407 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో నుంచి వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలతో లేకపోతే క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ అధికారులను ఈసందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న యాసంగి సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో యాసంగి ధాన్యం సేకరణపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, సివిల్ సప్లయి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, సివిల్ సప్లయి శాఖ జిల్లా అధికారి జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతి



సమ్మయ్య (ఫైల్)

సైదాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామశివారులోని మొలంగూర్‌రోడ్‌లో గురువారం ట్రాక్టర్‌టైర్ కిందపడి డ్రైవర్ పొల్లు దాసరి సమ్మయ్య(57) మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన పొల్లుదాసరి సమ్మయ్య అదే గ్రామానికి చెందిన ఓవ్యక్తి ట్రాక్టర్‌లో లోడ్ వేసుకొని సైదాపూర్ నుంచి మొలంగూర్‌వైపు వెళ్తున్నాడు. ట్రాక్టర్‌ను లోలెవల్ వంతెన వద్ద ఆపి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అంతలోనే ట్రాక్టర్ చిన్నచిన్నగా కదులుతుండడంతో దానిని ఆపేందుకు సమ్మయ్య ప్రయత్నిస్తూ ట్రాక్టర్ ఎక్కబోయాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి ట్రాక్టర్ పెద్ద టైర్‌కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మంథనిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన మీసాల రాకేష్ (32) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రాకేష్ సోమవారం ఉదయం గడ్డి మందుతాగి ఇంటికి రాగా కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం మంథనికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందాడు. రాకేష్ ఆత్మహత్యకుగల కారణాలు పూర్తిగా తెలియరాలేదు.

అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య

అంతర్గాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు తాళలేక తాటిపల్లి పద్మ(40) అనేగృహిణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినసంఘటన గురువారం రామగుండం పట్టణంలోని సీ కాలనీలో చోటుచేసుకుంది. రామగుండం ఎస్ఐ సంధ్యారాణి తెలిపిన వివరాలప్రకారం జెన్‌కో ఉద్యోగి అయిన తాటిపల్లి కృష్ణమూర్తి కుటుంబం రామగుండం సీ కాలనీలో నివాసముంటున్నారు. కృష్ణమూర్తి భార్య పద్మ కొన్నిసంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో భర్త ఇంట్లో లేని సమయంలో పద్మ వంట గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ పంచనామా నిర్వహించి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

లారీ ఢీకొని విద్యార్థులకు తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బైపాస్ రహదారిలోని ముష్టిపల్లి చౌరస్తాలో గురువారం లారీ ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. కోనరావుపేట మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన ఉత్కం అజయ్, నీరటి భరత్‌లు సిరిసిల్లలోని కళాశాలకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతుండగా బైపాస్ రహదారిపై వెంకటాపూర్ వైపు నుంచి వేములవాడకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా లారీని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

● ఒకరికి తీవ్రగాయాలు

జైపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం చెక్‌పోస్టు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో కారు యాజమానికి తీవ్ర గాయాలైనట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా నుంచి మట్టి లోడుతో వస్తున్న లారీ ఇందారం చెక్‌పోస్టు సమీపానికి రాగానే రహదారిపై లారీ ఆగిపోయింది. గోదావరిఖనికి చెందిన రేణికుంట్ల దత్తమూర్తి తన కారులో మంచిర్యాలకు వస్తుండగా ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాల య్యాడు. సంఘటన స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గాయాలపాలైన దత్తమూర్తి గోదావరిఖని ఎన్‌టీసీలోని అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉంటాడని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడని ఎస్ఐ తెలిపారు.

తాడిచెట్టుపై నుంచి పడి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తాడిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని మంగపేటలో చోటుచేసుకుంది. గురువారం గ్రామానికి చెందిన తాళ్లపెల్లి శంకర్‌గౌడ్ (55)తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా తలకు, చేతులకు, నడుముకు గాయాలు కాగా పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బుర్ర సదానందంగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నరసయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

భవనంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనంపై నుంచి పడి ఈశ్వర్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఆసుపత్రి ఆవరణలోని క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు చేస్తున్న మేస్త్రీ ఈశ్వర్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా కాంట్రాక్టర్ రక్షణచర్యలను పాటించకపోవడం వల్లనేప్రమాదాలకు గురవుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ గురువారం గాయపడ్డారు. ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు కాగా పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు సుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు సంపత్‌ను మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

వేములవాడ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం నందికమాన్ శివారులో ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీంతో సదరు వృద్ధురాలిని చికిత్సనిమిత్తం ఏరియాఆసుపత్రికి తరలించారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు

శంకరపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్‌లో కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన ఇనుకొండ మల్లారెడ్డి అతని భార్య శ్రీలత భూతగదాల విషయంలో సదయ్యను కులం పేరుతో దూషించారన్నారు. ఈ మేరకు సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

వరికి మొగి పురుగు

● మందులు స్ప్రేచేసినా తగ్గని ఉధృతి ● దిగుబడిపై ఆందోళనలో రైతులు



సారంగాపూర్ మండలంలో మొగి పురుగు ఆశించిన వరి పంట, వరి పైరును చూపుతున్న రైతు

సారంగాపూర్, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పంటకు మొగి పురుగు ఆశించింది. ఈ సీజన్‌లో మండలంలో 10,800 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. బోర్లు, బావులు, చెరువు ఆయకట్టు కింద అధిక మొత్తంలో రైతులు వరినే పంటనే సాగు చేశారు. వరికి సోకిన మొగి పురుగు నివారణ కోసం రైతులు రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేశారు. అయినా పురుగు ఉధృతి తగ్గకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు తీవ్ర ఆందోళన చెందతున్నారు. మండలంలో రెండు వ్యవసాయ క్లస్టర్లు ఉండగా సంబం ధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు ఇచ్చినా సందర్భాలు లేవని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో మొత్తం 11 ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా కొందరు యజమానులు నాణ్యతలేని మందులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి రైతులకు నాణ్యమైన పురుగు మందులను అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

మందుల కోసం వేలు ఖర్చు చేశా

దేశరాజుల మధు, రైతు, బట్టపెల్లి

ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంటను సాగు చేశా. పంటలో మొగి పురుగు నివారణ కోసం వేలల్లో ఖర్చు చేసి రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేశా. అయి నా మొగి పురుగు ఉధృతి మాత్రం తగ్గలేదు. మొగి పురుగు ప్రభావంతో ఊస పోయింది. దిగబడి తగ్గుతుందని ఆందోళనగా ఉంది.

నారు మడిలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మండల వ్యవసాయ అధికారి, ప్రదీప్‌రెడ్డి

నారు మడి నుంచే సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే మొగి పురుగును నివారించవచ్చు. నాటు వేసే ముందు నారు కొనలను తుంచి నాటు వేసినట్లయితే వరిలో మొగిపురుగు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఫర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు చేపట్టి నాణ్యతలేని మందులు అమ్మిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

వైన్స్‌లో చోరీకి యత్నం

శంకరపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పులో కొంత భాగం తొలగించి లోపలికి దూరారు. విద్యుత్‌సరఫరా నిలిపివేసి, ఇన్వర్టర్లు ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వీడీఆర్‌బాక్స్‌తోపాటు రెండు బీరుసీసాలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కొత్తపల్లి రవి, క్లూస్ టీమ్ సీఐ బృందం సభ్యులతో సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించి సంఘటనపై విచారణ చేపట్టారు.

రత్నాపూర్‌లో ఎక్సైజ్ దాడులు

రామగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాతీ పరిధిలోని రామగిరిఖిల్లా ప్రాంతంలో నాటుసారాయి తయారీ చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు గురువారం ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లంపానకంను ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మహేందర్, శ్రీను, శ్యామ్, రవిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి27(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బిస్క సత్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఈనెల 26న రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న గంగయ్యను బిస్క సత్యం తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన అతన్ని మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారని తెలిపారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన బాధితుడి బావమరిది కర్రోళ్లమల్లేశ్ ఫిర్యాదుతోకేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం మెయిన్ గేట్ వద్ద కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించగా ముగ్గురు వ్యక్తుల వద్ద 1 కిలో 180 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బైక్‌పై ముగ్గురుయువకులు పారిపోయే యత్నం చేశారని, వారిని అదుపులోకి తీసుకుని సోదాచేయగా గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు బీహార్ రాష్ట్రానికి చెందినవారిని వీరి ప్రస్తుత నివాసం అశోక్‌నగర్ అని తెలిపారు. నీరజ్‌కుమార్(20), సోరుకుమార్(19), దిలేందర్ కుమార్(29)లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, రాజన్న, హెడ్‌కానిస్టేబుల్ బషీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేర రూ. 57.13లక్షల మోసం

● అద్దె అకౌంట్‌తో లావాదేవీలు ● అకౌంట్ అద్దెకు ఇచ్చిన మహారాష్ట్ర విద్యార్థి అరెస్టు



కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.57.13 లక్షలు మోసపోయాడు. గత ఏడాది జరిగిన ఈ సంఘటనలో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు ఆకర్షితుడైన గోదావరిఖనికి చెందిన వ్యక్తికి మాయ మాటలు చెప్పి సైబర్ నేరగాళ్లు ఉచ్చు బిగించారు. మహారాష్ట్రకు చెందిన ఒక విద్యార్థి అకౌంట్‌ను అద్దెకు తీసుకుని సైబర్ నేరగాళ్లు గోదావరిఖనికి చెందిన వ్యక్తి నుంచి రూ.57.13 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. బాధితుడు గత ఏడాది నవంబర్ 1న రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని డీఎస్‌పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయిన అకౌంట్ హోల్డర్ మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లా నవవాడి గ్రామానికి చెందిన శుభం నవనాథ్ శెల్కే(20) అనే విద్యార్థిదిగా గుర్తించారు. అతడిని విచారించగా తాను టెలీగ్రామ్ యాప్‌లో పరిచ యమైన ఒక వ్యక్తికి తన అకౌంట్‌ను నెలకు రూ.5వేలకు అద్దెకు ఇచ్చినట్టు పేర్కొన్నాడు. అకౌంట్ అద్దెకు ఇచ్చిన విద్యార్థి శుభం నవనాథ్ శెల్కేను గురు వారం అరెస్టు చేసినట్టు సైబర్ క్రైమ్ డీఎస్‌పీ వెంకటరమణ పేర్కొన్నారు. ప్రజలు ఎవరూ కూడా ఆన్‌లైన్ గేమ్‌లు, ట్రేడింగ్ ఇన్వెస్టిమెంట్లు లోన్‌యాప్‌లు, డిజిటల్ అరెస్టు, మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ, ఫెడెక్ కొరియర్ ఫ్రాడ్ పేర వచ్చే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు.

అర్ధరాత్రి నర్సింగాపూర్‌లో హంగామా

● యూట్యూబ్ యువతులపై దాడి

చందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఓ పాట చిత్రీకరణ కోసం వచ్చిన యూట్యూబ్ ఛానల్‌యువతులపై ముగ్గురువ్యక్తులు మద్యం మత్తులో హంగామాచేసి దాడిచేశారు. ఈ ఘటన మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట వివిధ ప్రాంతాలకు చెందిన యువతులు మండలంలోని మూడపల్లి గ్రామంలోని బండపై ఒక పాటను చిత్రీకరించారు. రాత్రి కావడంతో విడిది కోసం నర్సింగాపూర్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం చేసిన అనంతరం ఇంటిముందు కూర్చుని పాటలు వింటున్నారు. గ్రామానికి చెందిన గంగాధర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులువచ్చి తాము పోలీసులమంటూ బెదిరించారు. పది నిమిషాల్లో ఇక్కడ నుంచి ఖాళీచేసి వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు పాల్పడడంతో, వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో గ్రామానికిచెందిన వ్యక్తులు, యువతులపై దాడిచేయడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించినట్లు యువతులు పేర్కొన్నారు. దీంతో 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని యువతులకు రక్షణ కల్పించేందుకు వేములవాడకు తరలించారు. ఈ సంఘటనపై జగిత్యాల రూరల్ మండలంలోని సోమన్‌పల్లికి చెందిన గుగ్గిళ్ల జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నక్క గంగాధర్, పెరుక శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

హుజూరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం సూపర్‌బజార్‌లోని మంజునాథ జ్యూవెలర్స్‌లో వెండి ఆభరణాలు దొంగతనం చేసిన ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంజునాథ జ్యూవెలర్స్‌లో ఆభరణాల కొనుగోలు పేరుతో గుర్తుతెలియని ఇద్దరు మహిళలు వెండి పట్ట గొలుసులు దొంగలించారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాళ్లను గుర్తించి వారికోసం పోలీసులు గాలిస్తుండగా హుజూరాబాద్ బస్టాండ్‌లో వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి దొంగలించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు.



విచారణ జరుపుతున్న ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి

అనుమతిలేని ఇటుక బట్టీలపై విచారణ

కరీంనగర్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బటీలపై ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. అనుమతి లేని ఇటుక బట్టీలపై స్థానికులు, కాంగ్రెస్ నాయకుడు రాకేష్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి గురువారం ఇటుక బట్టీల వద్దకు వెళ్లి విచారణ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడితో పాటు, ఇటుక బట్టీల వ్యాపారులతో విచారణ చేపట్టారు.వారంరోజుల్లో అనుమతిపత్రాలు సమర్పించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీవో వ్యాపారులకు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 400 రేక్‌ల యూరియా రవాణా



400రేక్‌కు జెండా ఊపుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రైల్వే మార్గం ద్వారా 400రేక్‌ల యూరియాను రవాణా చేసినట్టు ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స చెప్పారు. గురువారం 400రేక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నాటికి 400రేక్‌లను తెలంగాణకు పంపినట్టు, ఆర్‌ఎఫ్‌సీఎల్ దేశంలోనే వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి రైతులకు సరసమైన ధరలో యూరియాను ఆర్‌ఎఫ్‌సీఎల్ అందిస్తుందన్నారు. పౌరులకు ఆహార భద్రత కల్పించేందుకు ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 11.70లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రవాణా చేశామన్నారు. యూరియా రవాణాకు కీలక పాత్ర పోషించిన కార్మికులకు కేంద్ర రసాయనాల, ఎరువుల మంత్రిత్వశాఖకు, వాటాదారులకు, రైల్వే అధికారులకు, తెలంగాణ పరిపాలనశాఖ అధికారులకు ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స కృతజ్ఞతలు తెలిపారు.

మహిళను వేధించిన యువకుడి అరెస్టు



బోగరి విజయ్‌కుమార్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన యువకుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సుందిళ్ల గ్రామానికి చెందిన బోగరి విజయ్ కుమార్ కొంత కాలంగా గోదావరిఖని గంగానగర్‌కు చెందిన ఓ మహిళను వేధిస్తున్నాడు. మహిళతో ఫోన్‌లో మాట్లాడిన మాటలను రికార్డు చేసి మహిళను వేధిస్తున్నాడన్నారు. ఎవరైనా మహిళలు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడడం, ఫొటోలు షేర్ చేయడం, మెసేజ్‌లు చేయరాదని, సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసి గ్రూపుల్లో పోస్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొండగట్టులో పారిశుధ్య లోపం



మెట్లపై లేని రక్షణగోడ

● గదుల వద్ద మురుగు నీరు
● కూలిపోయిన వసతి గదుల మెట్ల రక్షణ గోడ
● పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద పారిశుధ్య లోపంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి సమీపంలో ఉన్న మారుతి నిలయం వసతి సముదాయం పక్కనే గల హోటల్ నుంచి వ్యర్థపు నీరు బయటికి వచ్చి వసతి గదులు మెట్ల వద్ద చేరి దుర్వాసన వస్తోంది. దీంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. వ్యర్థపు నీటిని మురుగుకాలువలోకి తరలించాల్సి ఉండగా మెట్ల పైనే పైపుల నుంచి వ్యర్థపు నీటిని వదు లుతున్నారు. దుర్వాసనతో పాటు చెత్తతో కూడిన నీరు మెట్లపై ఉండడంతో భక్తులు గదులలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం భక్తులకు శాపంగా మారింది. అవే మెట్లపై నుంచి కొంచెం ముందుకు వెళ్లగా మెట్ల రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మెట్ల నుంచే భక్తులు గదులలోకి వెళ్లేటపుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



మెట్లపై హోటల్‌నుంచి వస్తున్న నీరు

ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలల పునరుద్ధరణకు అవకాశం

తిమ్మాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) గుర్తింపు పొంది, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అనుబంధం రద్దయిన ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలలు తిరిగి అనుబంధం పొందుటకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అవకాశం ఇచ్చిందని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తిగల ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలల యాజమాన్యాలు 2025-26నుంచి 2028-2029 విద్యాసంవత్సరానికి పునరుద్ధరణకు పూర్తిస్థాయి ప్రతిపాదనలను ఈనెల31లోగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణమండలి (ఎస్‌సీఈఆర్‌టీ) సంచాలకులు, హైదారాబాద్ వారికి సమర్పించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కున్న కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో ఈ నెల 22న రాత్రి జరిగిన ఘటనలో నిందితుడు హుస్సేనిపురకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను అరెస్టు చేశామని కరీంనగర్ మూడోటౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌రూరల్ మండలం చేగుర్తికి చెందిన సత్తు నరేందర్ గాంధీ చౌరస్తా వద్ద ఉండగా ఒక వ్యక్తి ఆటోలో వచ్చి నరేందర్‌ను బెదిరించి నెట్టివేసి సెల్‌ఫోన్ బలవంతంగా తాక్కెళ్లాడని తెలిపారు. బాధితుడి తలకు గాయాలుకాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని సోదరుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష

కోరుట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుల కేసులో ఒకరికి ఒక సంవత్సరం కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ కోరుట్ల జెఎఫ్‌సీఎం జడ్జి పావని గురువారం తీర్పు నిచ్చారు. సీఎంఎస్ ఎస్సై కథనం ప్రకారం.. కోరుట్లకు చెందిన రాముకు కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన యశోదకు 2007లో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనపు కట్నం తేవాలంటూ రాము తన భార్య యశోదను తరచూ వేధించేవాడు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 4వేల జరిమానా విధించాడు.




అడవిపదిరలో పిల్లర్లు పోసి వదిలేసిన వంతెన, అసంపూర్తిగా ఉన్న అడవిపదిర వంతెన

నిధులు సరిపోవు..

నిర్మాణాలు పూర్తి కావు

- అసంపూర్తి వంతెనలతో తప్పని అవస్థలు
- పట్టించుకోని పాలకులు

వీర్నపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణాలపై దృష్టి సారించడం లేదని విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న వంతెనలు పూర్తయి అందుబాటులోకి వస్తే వాహనదారుల ప్రయాణం సురక్షితంగా సాగుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుత్తేదారు నిర్లక్ష్యం..

వంతెనలు పూర్తిచేయకుండా వదిలేయడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడంలేదు. గుత్తేదారు కనీసం సరైన తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయక పోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. అడవి పదిరలో వానాకాలం వరి ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో రైతులు, గ్రామస్థుల సహ కారంతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. మళ్లీ యాసంగి ధాన్యం కోతకు వస్తుండటంతో సరైన రోడ్డు లేక లారీలు రావడానికి రైతులకు ఇబ్బందులు తప్పేలాలేవు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో వాగులు ఉధృతంగా వరదలు రావడంతో వంతెనలు పూర్తికాక రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పక్క గ్రామాల మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

అదనపు నిధుల కోసం ఆరాటం..

వీర్నపల్లి మండలంలో అడవిపదిర, బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామాల పరిధిలోని హైలెవల్ వంతెనలు నిధులు సరిపోక నిర్మాణాలు ఆగిపోయాయి. అడవిపదిర గ్రామంలో రూ.2కోట్ల ఎమ్ఆర్ఆర్ గ్రాంట్ నిధులతో వంతెన నిర్మాణ పనులు చేపట్టి పిల్లర్లు పోసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామ పరిధిలోని గోన్యా నాయక్ తండాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో వంతెన పనులు చేపట్టి అప్రోచ్‌రోడ్డు, సైడ్‌వాల్ నిర్మాణాలు ఆగిపోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. వంతెన నిర్మాణాలు పూర్తయ్యేందుకు అదనపు నిధులు అవసరం ఉందని ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. అప్రోచ్ రోడ్లకు, స్లాబ్ పనులకు అదనపు నిధులు మంజూరయితే వంతెన పనులు పూర్తయి ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. పాలకులు, ఉన్నతాధికారులు మారుమూల అటవీ గ్రామాలపై దృష్టి పెట్టి అసంపూర్తి వంతెనలను పూర్తిచేసి ప్రజల అవస్థలను తొలగించాలని కోరుతున్నారు.



గొన్యా నాయక్ తండాలో అసంపూర్తిగా ఉన్న వంతెన

రెండేళ్లు దాటినా వంతెన పూర్తికాలేదు..



జాలపల్లి మనోజ్ కుమార్, అడవిపదిర

గ్రామంలో వంతెన నిర్మాణం చేపట్టి రెండేళ్లు దాటినా పనులు పూర్తికాలేదు. కనీసం కాంట్రాక్టర్ తాత్కాలిక రోడ్డు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థుల సహకారంతో ఒకరోజు నిరాహార దీక్ష చేసినా ఫలితం లేదు. పాలకులు, అధికారులు పట్టించుకుని వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

ప్రతిపాదనలు పంపాం..



శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈఈ

అడవిపదిర, గోన్యా నాయక్ తండాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హైలెవల్ వంతెనలకు నిధులు సరిపోక అసంపూర్తిగా ఆగిపోయాయి. ప్రభుత్వానికి అదనపు నిధుల కోసం నివేదికలను పంపించాం. నిధులు మంజూరు కాగానే వంతెనల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



సాయికృష్ణ(ఫైల్)

మల్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనం టాప్‌పై కూర్చున్న ఇద్దరు గురువారం ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఇందులో సాయికృష్ణ (17) అనే బాలుడు మృతిచెందగా సంపంగి ప్రేమ్‌చంద్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన శివరాత్రి లింగయ్య కుటుంబసభ్యులు, బంధువులతో గురువారం అంజనేయస్వామిని దర్శించుకొని ట్రాలీ ఆటోలో తిరుగుపయనం అవుతుండగా ప్రమాదం జరిగింది. ఘాట్‌రోడ్డు దిగుతుండగా వాహనం టాప్‌పై లింగయ్య కొడుకు సాయిక్రిష్ణ, సంపంగి ప్రేమ్‌చంద్ కూర్చున్నారు. భారీ వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్ సాయిక్రిష్ణకు తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వాహనం టాప్‌పై కూర్చున్న సాయిక్రిష్ణ, సంపంగి ప్రేమ్‌చంద్ కిందపడ్డారు. వారిపై నుంచి అదే వాహనం వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతి చెందాడు. కాగా లింగయ్య కుటుంబం బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని గురువారం కొండగట్టుగా రాగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

- కిష్టునాయక్‌తండాలో విషదం..

ఎల్లారెడ్డిపేట : మల్యాల మండలం కొండగట్టు అంజనేయస్వామి దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని బాలుడు శివరాత్రి సాయికృష్ణ(17) దుర్మరణం పాలయ్యాడని కుటుంబ సభ్యులు, స్థానికులు గురువారం తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని శివరాత్రి విజయ-లింగం దంపతులు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కొడుకు సాయికృష్ణ 8వ తరగతి వరకు చదువుని మధ్యలోనే ఆపేశాడు. విజయ-లింగం దంపతులు కొడుకు సాయికృష్ణతో కలిసి తన బంధువులు కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి ఆటోలో బయలుదేరారు. మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఆటోపైన కూర్చున్న సాయికృష్ణ ఒక్కసారిగా కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనితోపాటు మరోవ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సాయికృష్ణ మృతిచెందాడు. బాలుడి మృతిలో కిష్టునాయక్‌తండాలో విషాదం నెలకొంది.

రాజన్న ఆలయంలో ఘనంగా మహాలింగార్చన

వేములవాడ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమం అర్చకులు ఘనంగా నిర్వహించారు ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో మహాలింగార్చన

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోరుట్ల రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షలో ఇన్విజిలేషన్ నిర్వహణలో వివాదాస్పదమైన ఉపాధ్యాయుడు నజీమొద్దీన్‌ను గురువారం జిల్లా విద్యాధికారి రాములు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మాడల్ స్కూల్‌లో జరగుతున్న పరీక్ష కేంద్రంలో అధికారులను తప్పుదోవ పట్టించి కూతురు పరీక్ష రాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేషన్ నిర్వహించడాన్ని గుర్తించి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నట్లు నరేశం తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు మరింత లోతుగా విచారిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలి



ఎస్‌యూ వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వీసీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్తకార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు తరలించడం సరికాదన్నారు. వీసీ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికితీసు కెళ్తామని మరిన్ని కొత్తకోర్సులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో జల్లపల్లి అంజన్న, గంట కిరణ్మయి, పూసాల విష్ణు, బాలకృష్ణ, కార్యదర్శి సాగర్, నగర కార్యదర్శి నందు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి

- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సమాజంలో చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని తారకరామనగర్, గాంధీనగర్ కాలనీల్లో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మీల బృందం పర్యటించింది. కాలనీలో పర్యటించి ఆయా కులాల జీవన స్థితి గతులు, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో చైర్మన్ నిరంజన్ మాట్లాడారు. చులకన భావంతో కులాలను చూడడం వల్ల ఆయా కులస్థులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి సునీత, తహసీల్దార్ వీరభద్రయ్య, కుల సంఘం నాయకులు కడారి రాజేందర్, శ్రీనివాస్, కనకయ్య, తిరుపతి, దొమ్మర కుల సంఘం నాయకులు చంద బాబు, జూపల్లి తిరుపతి, చంద రమేష్, జూపల్లి విజయ్, ముస్కు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..

బీసీ కులాల్లోని వీరముష్టి, పిచ్చకుంట్ల, దొమ్మర కులాల స్థితిగతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలను పరిష్కరింపజేస్తామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కులాల పేరు మార్పు కొరకు బీసీ కమిషన్‌కు అనేక విజ్ఞాపన పత్రాలు అందుతున్నాయన్నారు. కులాల పేరు మార్పు కొరకు ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామన్నారు. జిల్లాల పర్యటనలో పరిశీలన అనంతరం ఈనెల 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పరిస్థితిని తీసుకవెళ్తామన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో అత్యంత పేదలను గుర్తించి అందులో అర్హత కల్పించడానికి కృషి చేస్తామన్నారు.

- కులాల పేర్లను మార్చేందుకు చర్యలు..

ధర్మపురి: సమాజంలో నేటికి చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా వాటిని మార్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని దుర్గమ్మ కాలనీలో బీసీ కమీషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు దుర్గకాలనీలో దొమ్మరులు, వీరముష్టి కులస్థుల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కమీషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, ప్రత్యేక అధికారి సతీష్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి కల్పన, మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గట్టు మల్లన్న జాతర



పూజలు చేస్తున్న భక్తులు

చొప్పదండి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లెలోని గట్టుమల్లన్న జాతర వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలను నిర్వహించారు.

దేశరాజుపల్లి పల్లె దవాఖానాకు ఎన్‌క్వాస్ అవార్డు



దేశరాజుపల్లి పల్లె దవాఖానా వద్ద సిబ్బంది

రామడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేశరాజుపల్లి పల్లెదవాఖానాకు ఎన్‌క్వాస్ కింద నాణ్యత సర్టిఫికెట్‌తోపాటు ఉత్తమ అవార్డు దక్కింది. నేషనల్ సిస్టం రిసోర్స్‌సెంటర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌క్వాస్ బృందం ప్రభుత్వ ఆసుపత్రులను మార్చి1న తనిఖీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 8 పల్లె దవాఖానాలకు ఎన్‌క్వాస్ నాణ్యత సర్టిఫికెట్‌తోపాటు ఉత్తమఅవార్డులకు ఎంపికచేశారు. ఇందులో రామడుగు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దేశరాజుపల్లె దవాఖానా 88.12శాతం మార్కులతో ఈ ఉత్తమఅవార్డును దక్కించుకుంది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే అవార్డు దక్కిందని మండల వైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆసుపత్రిలో కాయకల్ప బృందం

వేములవాడ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని కాయకాల్పబృందం గురువారం సందర్శించింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలను, ఆసుపత్రి పరిశుభ్రతను గురించి బృందంసభ్యులు తెలుసుకున్నారు. మూడు సంవత్సరాలుగా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందుతూ వస్తున్నది. ఈసారి కూడా అదేస్థాయిలో మార్కులు వస్తాయని ఆశిస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ పెంచలయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, డాక్టర్ అనిల్, డాక్టర్ చారి, డాక్టర్ సుభాషిణి, నర్సింగ్ సూపెరింటెండెంట్లు అంజమ్మ, సుందరి, విజయలక్ష్మి, సంజీత, బ్లోసమ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



పతకంతో విక్రమ్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే జూనియర్ జాతీయ స్థాయి జూడో పోటీలకు జిల్లాకు చెందిన ఎం విక్రమ్ కుమార్ ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా జూడో సంఘం కన్వీనర్ దామోదర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సలార్ ఈ మిలాద్ ఓవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల24న జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల జూడో పోటీల్లో పాల్గొన్న వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎం విక్రమ్ కుమార్ 100 కేజీలపై విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విక్రమ్ కుమార్‌ను జూడో సంఘ ప్రతి నిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- మూడు బైక్‌లు స్వాధీనం
- చోరీ జరిగిన గంటలోనే ఛేదన

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చోరీ జరిగిన గంటలోనే గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం ఛేదించారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకుని అతని వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనపర్చుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. మండలంలోని జగదాంబ తండా గ్రామానికి చెందిన బాదావత్ గోపాల్ ఈనెల 26న రాత్రి తన కోళ్ల ఫారం వద్ద ద్విచక్రవాహనాన్ని నిలిపి గేటుకు తాళం వేసి ఇంటికి చేరుకున్నాడు. ఈనెల 27న ఉదయం కోళ్ల ఫారం వద్ద వెళ్లి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. దాంతో బాధితుడు గోపాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంతో అనుమానాస్పదంగా కనిపించిన కామారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ మున్నీరును పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించారు. గంభీరావుపేట, కామారెడ్డి పట్టణాల్లో బైక్‌లను దొంగించానని అంగీకరించాడు. వాహనాలను స్వాధీనపర్చుకుని నిందితుడు మహ్మద్ మున్నీరును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ బాల శ్రీనివాస్‌ను ఎస్ఐ శ్రీకాంత్ అభినందించారు.

గురుకులం విద్యార్థికి అస్వస్థత

- కోరుట్లలో చికిత్స అనంతరం డిశ్చార్జ్
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, మార్చి, 27(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులానికి చెందిన విద్యార్థి రాపర్తి హర్ష అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి చేర్పించి చికిత్స అందించారు. గురువారం ఉదయం తరగతి గదిలో ఉన్న సమయంలో చేయి నొప్పిగా ఉందని ఉపాధ్యాయుడికి తెలపగా వెంటనే ప్రిన్సిపాల్ మాధవిలతకు సమాచారమిచ్చారు. ప్రిన్సిపాల్ వెంటనే విద్యార్థి తల్లిదండ్రులకు విషయం తెలిపిన అనంతరం కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. చీమలు కుట్టడంతో విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడని ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ విద్యార్థిని పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఇంటికి పంపించినట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. వెంటనే గురుకులంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు చేశారు. 56మంది విద్యార్థులకు స్కిన్ ఎలర్జీ, కడుపునొప్పి ఉన్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

కథలాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) సిరికొండ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న ఆర్ఐ నగేశ్‌ను దుర్భాషలాడిన సంగ సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. స్పెషల్ టీంతో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాగులపేటకు చెందిన సంగ మహేశ్‌ను ఆర్ఐ నగేశ్ పట్టుకున్నారు. దీంతో జాకీతో లేపి ఇసుకను కింద పారబోశాడు. అయితే మరో డ్రైవర్‌తో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా సతీష్ ఆర్ఐని దుర్భాషలాడినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడిన సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై దాడులు

కోరుట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గురువారం రాత్రి జగిత్యాల జిల్లా వైద్యధికారి ప్రమోదు కుమార్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అసుపత్రులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా నిర్వహిస్తున్నారని నోటీలను జారీ చేశారు. నోటీసలను స్వీకరించిన ఆసుపత్రి నిర్వహకులు ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని వైద్యాదికారి కార్యాలయంలో హజరు కావలని నోటీలసులో పేర్కోన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 12వ తేదీన దుబాయిలోని బిట్స్ ఫిలానీ క్యాంపస్‌లో వండర్‌కస్తాన్ రోబోటిక్ ఎడ్యూకేషన్ సంస్థ నిర్వహించే వరల్డ్ స్కూల్ సమ్మిట్ కార్యక్రమంలో అంతర్జాతీ అత్యుత్తమ ఉపాధ్యాయుడు పురస్కారానికి తారకరామ నగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అడ్లగట్ట గంగాధర్ ఎంపికయ్యాడు. విద్యా రంగంలో ఉపాధ్యాయుడు గంగాధర్ చేసిన కృషిని గుర్తించి సంస్థ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు వరల్డ్ స్కూల్ సమ్మిట్ ఆర్గనైజర్ అక్షయ అఃఉజా క్యూరేటర్ దుబాయి నుంచి గంగాధర్‌కు ఆహ్వాన పత్రికను పంపారు.

కొండగట్టులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

మల్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎస్పీ అశోక్‌కుమార్ చేపట్టిన 'సురక్షిత ప్రయాణం' కార్యక్రమంలో భాగంగా దిగువ కొండగట్టులో మల్యాల పోలీసులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. గురువారం మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ పరిశీలించారు. ప్రజల భద్రతతో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల వేగం నియంత్రించడంతో ప్రమాదాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ రవి పేర్కొన్నారు.

నేడు వార సంతకు వేలం

వెల్గటూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్‌లో ప్రతీ బుధవారం నిర్వహించే వార సంతకు ప్రత్యేకాధికారి శేఖర్ ఆధ్వర్యంలో నేడు వేలం వేయనున్నట్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి, ఉత్సాహం ఉన్న వారు గ్రామ పంచాయితీ కార్యాలయంలో నేడు నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని ఒక ప్రకటనలో కోరారు.

బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ



జగిత్యాలలో వినతిపత్రాలను స్వీకరిస్తున్న బీసీ కమిషన్ సభ్యులు



వినతిపత్రం అందిస్తున్న బీసీహక్కుల సాధన సమితి నాయకులు

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యటించిన బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వివిధ సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. బీసీలకు సామాజిక న్యాయం అందేలా కృషి చేయాలని కోరుతూ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు జగిత్యాల బీసీ హక్కుల సాధన సమితి నాయకులు వినతిపత్రం అందించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. బీసీలలో గల అట్టడుగు కులాలకు సైతం రాజ్యాంగ ఫలాలు అందించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్న సురేశ్, రాగిళ్ల నారాయణ, రాపర్తి రాజన్న, రాపర్తి మహేశ్, వెన్న మహేశ్, సిరిపురం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్థులకు ఉపాధి కల్పించాలి

జగిత్యాల అర్బన్, 27 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను జిల్లా మేరు సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు తమ కుల వృత్తి అంతరించి పోతుండడం వలన అనేక మంది మేరు కులస్తులు దేశాన్ని విడిచి బతుకు దెరువు కోసం విదేశాల బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుట్టించే యూనిఫాంలు, బడి పిల్లల బట్టలు అన్ని మేరు కులస్తులకే ఇచ్చి కుట్టించడం ద్వారా అనేక మందికి పని దొరుకుతుందని విన్నవించారు. కార్యక్రమంలో మేరుసంఘం రాష్ట్ర కార్యదర్శి రాయిల్ల సత్యనారాయణ, రాపర్తి వినోద్, మంతెన శ్రీనివాస్, రాయిల్ల మురలి, రాపర్తి రాజు, వెన్న రాజేశ్వర్, తదితరులు బిసి కమీషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను ఆ సంఘం నాయకులు విన్నవించారు. ఈసందర్బంగా నాయిబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు పెండెం మహెందర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులను ధర్మకర్తలుగా నియమిస్తున్నదని, తెలంగాణలో కూడా నియమించాలని విన్నవించారు. కార్యక్రమంలో రచమల్ల కిషన్, శ్రీనివాస్ ఉన్నారు.

కొన్ని బీసీ కులాలకు ప్రత్యామ్నాయ పేర్లు పెట్టాలి

జగిత్యాల అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చిన్నచూపుకు గురవుతున్న బీసీ కులాలకు ప్రత్యామ్నయ పేర్లు ఇవ్వడం ద్వారా సమాజంలో ఉన్నతంగా బతికే అవకాశం ఉంటుందని తెలంగాణ బీసీ జేఏసీ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు విజ్ఞప్తి చేశారు. జగిత్యాలకు వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సమాజంలో చిన్నచూపుకు గురవుతున్న బుడబుక్కలు, పిచ్చకుంట్ల, దొమ్మరి, వీరభద్రియ కులాలవారు విద్యాలయాలు, ఉద్యోగ సంస్థల్లో కార్యాలయాల్లో పిలుచుకోవడానికి ఇబ్బందులు పడుతున్న దయనీయ పరిస్థితులను ఈ సందర్భంగా ఆయన బీసీ కమిషన్ చైర్మన్‌కు వివరించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి) : వడగళ్ల వానకు తడిసిన ధాన్యం, పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని టీడీపీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. యాసంగిలో పంటలు సాగు చేసుకున్న రైతులకు వడగళ్ల వాన రూపంలో మండలంలోని ఏఎస్‌ఆర్‌తండా, రంగరావుపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాలలోని తడిసిన ధాన్యం, దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి దెబ్బతిన్న పంటలు, తడిసి ధాన్యం గురించి నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో పంటలు సాగు చేసుక్ను రైతులకు చేతికి వచ్చే సమయంలో వడగళ్ల వాన రూపంలో తీవ్రంగా దెబ్బతీసిందని, వారికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గజ్జెల్లి రాజగణేష్, నరసింహ, చందు, షాదుల్లా, ఫిరోజ్‌ఖాన్, సిద్దు, గూగ్లవత్ మార్వార్, గూగ్లవత్ కర్ణ, ప్రభాకర్, బాపులాల్, రమేష్, తిరుపతి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



వెల్గటూర్‌లో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కోరుట్ల రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలంలోని మాదాపూర్, కల్లూర్, సంగెం, నాగులపేట గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్ దారిశెట్టి రాజేష్, వనతడుపు ఆంజయ్య, చెప్యాల నర్సయ్య, బాస్కర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకుడు రాజనర్స య్యను పోలీసులు అరెస్టు చేశారు.

● **మెట్‌పల్లి రూరల్:** మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆకుల రాజారెడ్డి, మెట్లా చిట్టాపూర్ మాజీ సర్పంచు బద్దం శేఖర్‌రెడ్డి, ఆత్మకూర్ మాజీ సర్పంచు భర్త చౌటుపల్లి అంజయ్యలను వేకువ జామున అరెస్టు చేసి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

● **పెగడపల్లి:** మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అరెస్టైన వారిలో ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, ఉప్పులంచ లక్ష్మణ్, చిన్నం తిరుపతి, ముద్దం మల్లేశం, సాయిని రవి ఉన్నారు.

● **వెల్గటూర్:** మండలంలో అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు కొమ్ము రాంబాబు, బోడకుంటి రమేష్, బాలుసాని రవి, విద్యాసాగర్, మెరుగు కొమురయ్య, అనుమాల తిరుపతి ఉన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు

కొడిమ్యాల, మార్చి27(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం సాగు చేసుకున్న రైతులు అధిక లాభాలు పొందుతారని ఏఈవో ప్రశాంత్ అన్నారు. గురువారం మండలంలోని నాచుపల్లి గ్రామంలో రైతులకు ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన కలిపించారు. ఈ సందర్బంగా ఏఈవో మాట్లాడుతూ నాటిన నాలుగవ సంవత్సరం నుండి 30 సంవత్సరాల వరకు పంట చేతికి వస్తుందన్నారు. కోతుల బెడద, వడగళ్ళ వలన ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఎకరాకు 57 మొక్కలు 90శాతం రాయితీ ఒక్కోక్క మొక్కకు 20 రూపాయలు ఎకరానికి 1140రూపాయలు డీడీ డీహెచ్ఎస్‌వో జగిత్యాల పేరున చెల్లించాలన్నారు. అవసరం ఉన్న రైతులు ఏవో, ఏఈవోలను సంప్రదించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, మార్చి27(ఆంధ్రజ్యోతి): పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి కాసం భాగ్యలక్ష్మీసత్యనారాయణ దంపతులు 10116 రూపాయలు, అనుమల్ల లక్ష్మీ10116 రూపాయలు విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి జలెందర్‌రెడ్డిలత దంపతులు 25116 రూపా యలు అందించినట్లు పూజారి రమేష్ తెలిపారు.

లక్ష్యం నెరవేరేనా..?

(5వ పేజీ తరువాయి)

రూ. 29.70 కోట్లు ఆదాయాన్ని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.15.98కోట్లు ఫీజు వసూలు లక్ష్యం కాగా రూ. 20.69 కోట్లు ఆదాయం సాధించారు. ప్రతి యేడు మార్కెట్ యార్డుల వారీగా ఉన్నతాధికారులు నిర్ధేశించిన టార్గెట్లకు మించి ఆదాయం రాబట్టారు. జిల్లాలోని మెజార్టీ మార్కెట్ కమిటీలు ఆదాయ లక్ష్యాన్ని అధిగమిస్తున్నాయి.

● **ఆదాయ లక్ష్యం..**

జిల్లాలోని 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 1,865.72 లక్షల ఆదాయ లక్ష్యాన్ని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో జగిత్యాల మార్కెట్ యార్డుకు రూ. 292.00 లక్షలు, మెట్‌పల్లి రూ. 180.34 లక్షలు, కోరుట్ల రూ. 155,68 లక్షలు, గొల్లపల్లి రూ. 97.00 లక్షలు, ధర్మపురి రూ. 234.49 లక్షల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్ధేశించారు.

మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ. 211.00 లక్షలు, కథలాపూర్ రూ. 134.37 లక్షలు, మేడిపల్లి రూ. 127.05 లక్షలు, మల్లాపూర్ రూ. 83.70 లక్షలు, ఇబ్రహీంపట్నం రూ. 43.75 లక్షలు, పెగడపల్లి రూ. 103.00 లక్షలు, వెల్గటూరు రూ. 133.34 లక్షలు, రాయికల్ రూ. 70.00 లక్షల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో అత్యధికంగా జగిత్యాల యార్డుకు రూ. 292.00 లక్షలు నిర్ధేశించగా, అత్యల్పంగా ఇబ్రహీంపట్నం యార్డుకు రూ. 43.75 లక్షల ఆదాయాన్ని టార్గెట్‌గా నిర్ణయిస్తూ ప్రతిపాదనలు రూపొందించారు.

లక్ష్యం మేరకు ఆదాయం సాధిస్తాం

-ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి



జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష్యం మేరకు ఆదాయాన్ని సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్ధేశించిన రూ.18.65కోట్ల ఆదాయాన్ని రానున్న సంవత్సరంలో సాధించడానికి అవసరమైన కృషి చేస్తాం.

మున్నూరు కాపు వర్తక సంఘ డైరీ ఆవిష్కరణ

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో గురువారం మున్నూరు కాపు వర్తక సంఘ డైరీని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయ ప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్నూరు కాపు వర్తక సంఘ నాయకులు అంజయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి



పూర్వ విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్

రాయికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలని విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన డాక్టర్ రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టీజీపీఎస్సీ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించి నిర్మల్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో చేరగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మల్యాల మాజీ ఉపసర్పంచ్ కొక్కుల నాగభూషణం తల్లి లక్ష్మి, మద్దుట్లకు చెందిన మ్యాకల మహేశ్ తండ్రి బుధవారం మృతిచెందగా మృతుల కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ పరామర్శించారు. ఆమె వెంట మండల బీజేపీ నాయకులు బొట్ల ప్రసాద్, కొల్లూరి గంగాధర్, గుండేటి గంగారాం, నులుగొండ సురేశ్, రుత్త కిషన్, కెల్లెటి రమేష్, పరమేష్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మెట్‌పల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వల్లనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మెట్‌పల్లి మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలోని మాదిగ కుంట చెరువు పునరుద్ధరణ అభివృద్ధి పనులకు మంజూరైన రూ.12 లక్షల 53 వేల విలువైన ప్రొసీడింగ్ పత్రాన్ని గురువారం గ్రామస్థులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్బంగా ఆయన సూచించారు.

నిధుల మంజూరీకి కృషి చేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగా రావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లింగం, తీపిరెడ్డి అంజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు నాయిని సురేష్, దిలీప్ గౌడ్, భూమేష్, షేక్ మహ్మద్, మాజీ సర్పంచ్ కాశీం, గంగాధర్, లక్ష్మారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

మల్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి, కొంపల్లికి చెందిన యువకులు కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. తక్కళ్లపల్లికి చెందిన కొత్తూరి నరేందర్ ఇండియన్ ఆర్మీ, కొంపల్లికి చెందిన నల్లాల నిఖిల్ భారత నావికదళంలో సీనియర్ సెకండరీ రిక్రూట్ విభాగంలో ఉద్యోగంకు ఎంపికయ్యాడు. వీరిద్దరు మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన ఫిజికల్ ట్రైనర్ కె.గంగసాగర్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఉద్యోగంకు ఎంపికైన నిఖిల్, నరేంధర్‌ను ట్రైనర్ గంగసాగర్‌తో పాటు ఆయా గ్రామస్తులు అభినందించారు.

పీఏసీఎస్ సర్వ సభ్య సమావేశం

ధర్మపురి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ధర్మపురి పీఏసీఎస్ అధ్యక్షులు (పర్సన్ ఇంఛార్జ్) ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సభ్యులతో కలిసి ఆయన సంఘం జమ, ఖర్చులు, పంట రుణాలు మంజూరు గురించి చర్చించారు. అలాగే వరి ధాన్యం కొనుగోలు తదితర అంశాలు గురించి చర్చించారు. అనంతరం అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డిని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ధర్మపురి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ షేర్ల రాజేశం, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, బల్యపెల్లి లింగన్న, బాజాల లక్ష్మి, పెరుక రమేష్, కుమ్మరి రవి, నక్క రాజు, గుర్రాల పెద్దపోశన్న, దాసరి రత్న, సహకార శాఖ అడాప్షన్ అధికారి రాము, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరి రాజేష్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్‌వో ప్రత్యేక పూజలు

ధర్మపురి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జగిత్యాల డీఎఫ్‌వో రవిప్రసాద్ గురువారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచారి, నంబి నరసింహమూర్తి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ధర్మపురి ఎఫ్‌ఆర్‌వో శ్రీనాథ్, డిప్యూటీ రేంజి అధికారి సదాశివుడు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో బీసీ కమిషన్ చైర్మన్ పూజలు



బీసీ కమిషన్ చైర్మన్‌కు స్వామి వారి చిత్రపటం అందజేత

ధర్మపురి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మీ గురువారం సందర్శించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీహెచ్ రమణాచారి, నంబి నరసింహమూర్తి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనతో పాటు సభ్యులు అందరికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు. వారి వెంట బీసీ కమీషన్ ప్రత్యేక అధికారి సతీష్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి కల్పన, ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సభ్యులతో కలిసి దర్శనం చేసుకున్న అనంతరం ఆలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధర్మపురి క్షేత్రానికి ఎంతో ప్రాశస్త్యం కలిగి ఉందన్నారు.

అంజన్నను దర్శించుకున్న బీసీ కమిషన్ చైర్మన్

మల్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మి దర్శించుకున్నారు. ఆలయంకు వచ్చిన కమిషన్ చైర్మన్, సభ్యులకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. వారి వెంట ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, అధికారులు ఉన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యం అందించాలి

-బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు



సమావేశంలో పాల్గొన్న బీడీ ఫెడరేషన్ కమిటీ సభ్యులు

కోరుట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికలకు పెరిగిన కరవుభత్యంను ఏప్రిల్ నెల నుంచి అమలు చేయాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు, బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో బీడీవర్కర్ ఫెడరేషన్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించి సుతారి రాములు మాట్లాడారు. రాష్ట్రంలో కరీంనగర్, నిజామా బాద్, వరంగల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలో అరులక్షల పైచిలుకు మంది బీడీ కార్మికులు ఉన్నారన్నారు.

వినిమయ ధరల పెరుగుదల సూచిక ప్రకారం 14 పాయింట్లు పెరిగిందని, ఒక పాయింటుకు పది పైసలు చొప్పున రూ.10.40 పైసలు పెరుగుతుందని దీని ప్రకారం వేయి బీడిలు చుట్టినందకు మొత్తం రూ. 261.97 ఏప్రిల్ మాసం నుండి అందించాలన్నారు. ఈ విషయంపై బీడి యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే నెలసరి ఉద్యోగలకు చేకర్స్, ప్యాకర్స్‌కు పెరిగిన కరువు భత్యం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీడి కార్మిక సంఘ గౌరవ అధ్యక్షులు ఎండి మౌలానా, ఎండి ముగ్రం, కొక్కుల శాంత, చెన్న విశ్వనాథం, ఎన్నం రాధ, మునుగురి హన్మంత్, వెన్న మహేష్, అందే వంశీకృష్ణ, రాడం ఆశోక్, బ్యాగ, గంగు, పద్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మెట్‌పెల్లి సీఐ

జగిత్యాల క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా అనీల్ కుమార్ ఇటీవల నియమితులై బాధ్యతలు స్వీకరించారు. గురువారం మర్యాద పూర్వకంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటుపడుతానని ఎస్పీకి వివరించారు.

వార్సికోత్సవ హంగామా

మల్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల లాస్య స్కూల్‌లో గురువారం నవరస్ పేరిట నిర్వహించిన వార్షికోత్సవం ఆకట్టుకుంది. ప్రతి ఏటా పాఠశాలలో నిర్వహించే ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్యాలు, వివిధ ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సున్మ, కరస్పాండెంట్ రాజు సాయిరాం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పనుల ప్రతిపాదనలపై సమావేశం

పెగడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సబ్ కి వికాస్ సబ్ కి యోజనపై గురువారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యద ర్శులతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల ప్రతిపాదనలపై చర్చించి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. సమావేశంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఏఈలు శంషేర్ అలీ, శ్రీమాన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

కోరుట్ల రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వంద శాతం ఇంటి పన్ను వసులుపై దృష్టి సారించాలని ఎంపీడీఓ రామకృష్ణ గ్రామస్థాయి అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని పారిశుద్ధ్య పనులను పరిశీలించి గ్రామ పంచాయితీలో రికార్డులను తనీఖీ చేశారు.

ఈ సందర్బంగా ఇంటి పన్ను వసూలు వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలోని నర్సరీ, ప్రకృతి వనంను పరిశీలించి పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యధర్శి సరితలు పాల్గొన్నారు.